ప్రజాశక్తి
బుధవారం 3 సెప్టెంబర్ 2025 5 అనంతపురం

విలేకరులతో మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

భూస్వాధీనంతో రైతులకు నష్టం

ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

సోలార్ ప్రాజెక్టుల పేరుతో సాగు భూములను తీసుకోవడం ద్వారా దానిపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గుత్తి మండలం బేతాపల్లి గ్రామంలో సోలార్ కోసం తీసుకున్న భూములను రైతుసంఘం నాయకులు మంగళవారం పరిశీలించారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి, జిల్లా నాయకులు దస్తగిరి, ఈశ్వర రెడ్డి, కెవిపిఎస్ మండల కార్యదర్శి మల్లికార్జున తదితరులు ఆ ప్రాంతంలో పర్యటించి రైతులతో మాట్లాడారు. అనంతరం గుత్తి పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఏపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ బేతాపల్లి గ్రామంలో 17వేల ఎకరాల భూముల సేకరణకు సోలార్ ప్రాజెక్టు సిద్ధమైందన్నారు. సోలార్ ప్రాజెక్టు కోసం జరుగుతున్న భూసేకరణతో రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో ఎకరాకు రూ.20వేలు లీజు ఇస్తామన్న సోలార్ సంస్థ ప్రస్తుతం రూ.30వేలు ఇస్తామని ప్రచారం చేసుకుటోందన్నారు. గతంలో సోలార్ ప్రాజెక్టులు నిర్మించిన ప్రాంతాల్లో ఏ ఒక్కరికీ ఉద్యోగం వచ్చిన దాఖలాలు లేవన్నారు. సోలార్ కంపెనీలు భూమి కొనుగోలుకు పెడుతున్న నియమ నిబంధనలు రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. 30 ఏళ్ల లీజు ఒప్పందంతో రైతు దీర్ఘకాలంలో భూమి మీద హక్కు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రైతుల ద్వారా భూములు తీసుకున్న సోలార్ కంపెనీ ఆ భూములను బ్యాంకులో తాకట్టు పెట్టి పెద్ద మొత్తంలో రుణం తీసుకుని, బ్యాంకుకు తిరిగి ఆ రుణం చెల్లించకపోతే భూమిపై రైతు హక్కు కోల్పోతాడన్నారు. రైతుకు సోలార్ కంపెనీకి వివాదం వస్తే కోర్టుకు వెళ్లాలంటే సోలార్ కంపెనీ కార్పొరేట్ సిటీలో ఉండే కోర్టులోనే కేసు వేసే నిబంధన ఉందని ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం భూములు లీజుకు తీసుకునే అంశాన్ని పున:పరిశీలించాలన్నారు. లీజు ఒప్పందం 10 ఏళ్లు దాటకుండా ఉండాలన్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు కౌలు 30 శాతం అదనంగా కలిపి ఇవ్వాలన్నారు. రైతుకు వ్యతిరేకమైన షరతులన్నింటినీ రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, మహిళ సంఘం మండల కార్యదర్శి ఎన్.రేణుకమ్మ, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్, వ్యకాసం మండల కార్యదర్శి ఎం.మల్లేష్, అధ్యక్షులు చందు, నారాయణ స్వామి పాల్గొన్నారు.

'అరగంటలో పోకపోతే తంతా'..!
◆ నోరుపారేసుకున్న గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

వార్త మెయిన్‌లో

అమాత్యుల నోట.. అదుపుతప్పుతున్న మాట..!

◆ వివాదాస్పదంగా నేతల తీరు ◆ నోరుపారేసుకుంటున్న ప్రజాప్రతినిధులు ◆ విస్మయం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రజాసేవ చేస్తామంటూ ప్రజా జీవితంలోకి వచ్చిన నేతలు ప్రతి విషయంలో ఆచితూచి వ్యవహరించాల్సి ఉంటుంది. ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాల్సి ఉంటుంది. వారి ప్రతి మాటా ఎంతో విలువైనదిగా పరిగణిస్తారు. కాని జిల్లాలో కొంత మంది నేతల మాటలు అదుపు తప్పుతున్నాయన్నాయి. ఒకరి తర్వాత ఒకరు నోరుపారేసుకుంటూ అబాసుపాలవుతున్నారు. ఇటీవల ఒక సినిమా రిలీజ్ విషయంలో ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాలో పెద్ద దుమారమే రేపాయి. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ జూనియర్ ఎన్టీఆర్ సినిమా వార్-2 సినిమా విడుదల సమయంలో అదే పార్టీకి చెందిన ఒకరికి ఫోన్‌లో మాట్లాడిన ఆడియో లీక్ అయింది. అందులో జూనియర్ ఎన్టీర్ తల్లి గురించి చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారమే రేపాయి. జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అనంతపురం నగరంలో పెద్దఎత్తున నిరసన చేపట్టారు. అంతకు మునుపు హైదరాబాద్‌లోనూ ఆయన ఫ్యాన్స్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే వ్యాఖ్యలను తప్పుబట్టారు. ప్రతిపక్ష పార్టీలు కూడా ఆయన చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. తరువాత పార్టీలోనూ చర్చ జరిగి అంతా సద్దుమణిగింది. దీనికంతటి కారణం ఆయన చేసిన వ్యాఖ్యలే కావడం గమనార్హం. ఒక నటుడి గురించి, కుటుంబ సభ్యుల గురించి మాట్లాడిన తీరును ప్రతి ఒక్కరూ తప్పుబట్టారు. తాజాగా ఎపి రైతుసంఘం నాయకులపై గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చేసిన వ్యాఖ్యలు విమర్శలకు తావిస్తోంది. ఇందుకు సంబంధించిన ఆడియోలు లేకపోయినప్పటికీ నేతలు ఎమ్మెల్యే వారిని ఏ రకంగా మాట్లాడారన్నది వివరించారు. రైతు సమస్యలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో గ్రామాలకెళ్లిన నాయకులను ఏమి పని అడగటం, వెళ్లకపోతే వచ్చి తంతామని బెదిరింపులకు దిగడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏదైనా సంఘాలు ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తే ఈ రకంగా బెదిరింపులకు దిగడం విస్మయాన్ని కలిగిస్తోంది. ప్రజాప్రతినిధిగా సమస్యలను అందరి నుంచి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాల్సిందిపోయి. ఈ రకంగా సమస్యను వెలుగులోకి రానివ్వకుండానే అడ్డుకోవాలని ప్రయత్నించడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. గతంలో గుమ్మనూరు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చకొస్తున్నాయి. మీడియాలో తమపై ఏదైనా కథనం వస్తే రైలు పట్టాలపై పడుకోబెడతామని రెవెన్యూ అధికారుల సమక్షంలో బాహాటంగానే బెదిరింపులకు దిగారు. దీనిపైనా విమర్శలొచ్చినా పార్టీ అధినాయకత్వం పెద్దగా సీరియస్‌గా తీసకోలేదన్న విమర్శ ఉంది. ఈ రకంగా నేతలు మాటల తీరు ఉన్నా అదుపు చేసే వారు లేరా అన్న ప్రశ్న సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రస్తుతం జిల్లాలో ఈ ఇద్దరు నేతలు మాట తీరు పెద్ద చర్చనీయాంశమై అయింది.

డా॥వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి నివాళి

అనంతపురం వైసిపి కార్యాలయంలో వైఎస్ఆర్‌కు నివాళి అర్పిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, ఇతర నాయకులు

మాజీ ముఖ్యమంత్రి డా॥వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా నియోజకవర్గ, మండల కేంద్రాల్లో వైఎస్ఆర్ విగ్రహాల వద్ద వైసిపి మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ చేసిన సంక్షేమ పాలనను గుర్తు చేసుకున్నారు. పలు ప్రాంతాల్లో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలనూ నిర్వహించారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆరోగ్యశ్రీ, 108, ఫీజురీయింబర్స్‌మెంట్ తదితర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని నాయకులు కొనియాడారు. ఉమ్మడి రాష్ట్ర ప్రజలు రాజశేఖర్‌రెడ్డి పాలనను ఎప్పటికీ మరువరన్నారు.

దోపిడీలకు అంబేద్కర్‌ను అడ్డు పెట్టుకోవడం దుర్మార్గం

◆ ప్రయివేట్ అంబులెన్స్ డ్రైవర్లు మానవత్వంతో మెలగాలి ◆ రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

వివక్ష, ఆర్థిక అసమానతలు రూపుమాపి సమానత్వం, ప్రజా సాధికారత సాధించాలన్న భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను కొందరు స్వార్థం, దోపిడీ, దౌర్జన్యాలకు అడ్డు పెట్టుకోవడం దుర్మార్గమని పలు ప్రజాసంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని ఎపి ఎన్‌జిఒ భవన్‌లో ప్రయివేట్ అంబులెన్స్ డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోరుతూ సిఐటియు, కెవిపిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ముత్తూజ, ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి, బీఎస్పీ జిల్లా నాయకులు ఓబులేసు, మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పసులూరి ఓబులేసు, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలి, తదితరులు మాట్లాడుతూ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఎదుట, భగత్‌సింగ్ ప్రయివేట్ అంబులెన్స్ డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో 18ఏళ్ల కిందట ఏర్పాటు చేసుకున్న అంబులెన్స్ డ్రైవర్ల స్టాండు ఏర్పాటు చేసుకున్నారన్నారు. అంతేగాకుండా వారందరూ ఒక పద్ధతి ప్రకారం సీరియల్‌గా బాడుగలు వెళ్లడమే కాకుండా బాడుగల రూట్లు.. రేట్లను పట్టికల ద్వారా ప్రకటించి సేవలు అందిస్తున్నారన్నారు. ఇలాంటి తరుణంలో కొంతమంది ఆకతాయిలు కులం ముసుగులో, ఆసుపత్రి లోపల ఉన్న బ్రోకర్ల ద్వారా లోపాయికారిగా ఒప్పందం చేసుకుని, ఇక్కడ వైద్య సదుపాయాలు సక్రమంగా లేవు ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తామంటూ ప్రభుత్వ హాస్పిటల్‌పై దుష్ప్రచారం చేయడం బాధాకరమన్నారు. వారి అవసరాల కోసం సీరియల్ పద్ధతి లేకుండా చేయడంతో దాదాపు 74 మంది కుటుంబాల పొట్టలు కొడుతున్నారన్నారు. ఇలాంటి పోకడలకు వ్యతిరేకంగా అందరం కలిసి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు లతీఫ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి గోపాల్, కెవిపిఎస్ జీవరత్నం, రాజా, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఇమామ్, భగత్‌సింగ్ ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్టీఆర్ శ్రీనివాసులు, ఆటో యూనియన్ నాయకులు ఆజాం ఆదినారాయణ, కారు స్టాండ్ యూనియన్ ఆదిరెడ్డి, వన్నూర్, అంబులెన్స్ యూనియన్ నాయకులు రాజేష్, నాగేంద్ర, మహేష్, నరేష్, అమర్నాథ్, అక్బర్, జిలాన్, ఆశారాజు, అశోక్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు

'అటల్ ల్యాబ్స్'లో పరిశోధనలకు అవకాశం

జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ ల్యాబ్స్, ఈ అటల్ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు సాంకేతికంగా, పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడుతాయని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు తెలిపారు. మంగళవారం అనంతపురం జెఎన్‌టియు ఇఇఇ విభాగం సెమినార్ హాలులో ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి అధ్యక్షతన అటల్ మెంటర్‌షిప్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు హైయర్ ఎడ్యుకేషన్, బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ టు ఎడ్యుకేషన్ సంయుక్తంగా ఉన్నత విద్యాశాఖ విద్యార్థులకు అటల్ ల్యాబ్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మూడు రోజుల శిక్షణకు విశ్వవిద్యాలయ పరిధిలోని అనుబంధ కళాశాలల విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఒకరోజు కురుకుంట గ్రామంలో ఉన్న అటల్ ల్యాబ్, ప్రభుత్వ పాఠశాల నెంబర్.2లో ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ, సిఇఒ బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ దేవకుమార్, బిసిడిఇ కోఆర్డినేటర్ జె.శ్రీనివాసులు, యూనిసెఫ్ కోఆర్డినేటర్ సుదర్శన్, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష శైలజాసాయి, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, విద్యార్థులు పాల్గొన్నారు

మెడికో నిత్యశ్రీకి రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి

వైద్య కళాశాల ప్రిన్సిపల్ అభినందన

అనంతపురం : అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో 3వ సంవత్సరం ఎంబిబిఎస్ చదువుతున్న వైద్య విద్యార్థిని ఓరుగంటి నిత్యశ్రీ రాష్ట్రస్థాయి బహుమతి సాధించింది. విశాఖపట్నంలోని రామకృష్ణ మిషన్ ఆశ్రమం భారతీయ సంప్రదాయాలపై 'స్వామి వివేకానంద ముద్ర' అనే అంశంపై రాష్ట్రస్థాయిలో కళాశాలల విద్యార్థులందరికీ వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో నిత్యశ్రీ ప్రథమ స్థానం సంపాదించింది. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య షారోన్‌సోనియా నిత్యశ్రీని ప్రత్యేకంగా అభినందించారు.

ప్రతిభ కనబరిచిన వైద్య విద్యార్థిని ఓరుగంటి నిత్యశ్రీని అభినందిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య షారోన్‌సోనియా

పత్తి దిగుమతి సుంకం తగ్గింపు జీవోను ఉపసంహరించాలి

ఎపి రైతుసంఘం నాయకుల డిమాండ్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

భారత ప్రభుత్వం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పత్తిపై 11శాతం దిగుమతి సుంకాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తూ తెచ్చిన జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాలో వ్యవసాయ సబ్సిడీలు ఎక్కువ.. పత్తి తక్కువ ధరకు వస్తుందన్నారు. మనదేశంలో కంపెనీలన్నీ ఏడాదికి అవసరమైన పత్తిని దిగుమతి చేసుకుని నిల్వ పెట్టుకుంటాయన్నారు. మరో మూడు నెలల్లో దేశంలో పత్తి పంట చేతికి వస్తుందన్నారు. ఈనేపథ్యంలో ఇప్పటికే గోడౌన్లు నిండా పత్తి నింపుకున్న కంపెనీలు మన రైతులు పండించిన పత్తిని కొనలేరన్నారు. దీంతో పత్తిని తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. సుంఖం తగ్గింపు వల్ల అమెరికన్ కంపెనీలకు లాభాల పంట పండుతుందన్నారు. ఫలితంగా మన రైతులకు ఆత్మహత్యలే శరణ్యం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి దిగుమతి సుంకాల జీవోకు వ్యతిరేకంగా ఈనెల బుధవారం గ్రామగ్రామాన రైతులు సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులతో సంతకాల సేకరించి వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో రైతులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి దస్తగిరి, సిఐటియు మండల కార్యదర్శి ఈశ్వరరెడ్డి, రైతులు ఎద్దుల హనుమంతురెడ్డి, రంగయ్య, చిన్న కొండయ్య, రఫీ, రంగస్వామి, షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : భారత ప్రభుత్వం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పత్తిపై 11శాతం దిగుమతి సుంకాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తూ తెచ్చిన జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ జీవోతో దేశంలోని పత్తి రైతులకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. మరో మూడు మాసాల్లో మన దేశంలో పత్తి వస్తుందన్నారు. ఆయా కంపెనీలు అప్పటికి గోడౌన్లు నిండా పత్తి నింపుకుంటే మన పత్తిని కొనుగోలు చేయరన్నారు. దీంతో దేశ రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. కావున వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి జీవోను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

సిఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు, నాయకులు

సిఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

అనంతపురం : ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మంగళవారం నగరంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో నాయకులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 10వతేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 'సూపర్ సిక్స్ – సూపర్ హిట్' భారీ బహిరంగ సభలో సిఎం పాల్గొననున్నారు. ఇందులో భాగంగా సభా ప్రాంగణం, పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఉమ్మడి అనంతపురం జిల్లా అబ్జర్వర్ కోవెలమూడి నాని, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కిసాన్ డ్రోన్ ప్రారంభం

యాడికి : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో వ్యవసాయ కిసాన్ డ్రోనును ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు.ఇ ందులో భాగంగా డ్రోను పనితీరు, ఎన్ని గంటలకు ఎన్ని ఎకరాలకు మందు కొట్టొచ్చనే వివరాలను డ్రోను ఆపరేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, సింగిల్‌విండో అధ్యక్షులు చలమారెడ్డి, టిడిపి నాయకులు గోపాల్‌నాయుడు, తాండ్ర విక్రమ్, తీరంపురం నీలకంఠ, విజన్ స్కూల్ విశ్వనాథ్, కోడూరు నీలకంఠారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హరిత 'అనంత' లక్ష్యం : ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురాన్ని హరిత అనంతగా మార్చడమే లక్ష్యమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మంగళవారం నగరంలోని శ్రీనగర్‌కాలనీలో మున్సిపల్ కమిషనర్ బాలస్వామి, టిడిపి నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో అనంతపురాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామన్నారు. గత 15 సంవత్సరాలుగా శ్రీనగర్ కాలనీలోని 80ఫీట్ రోడ్డు నిర్మాణం లేక ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ రోడ్డు సమస్యను పరిష్కరించామన్నారు. రానున్న రోజుల్లో అనంతపురం నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం సుబ్రమణ్యం, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, మాజీ కార్పొరేటర్లు రాజారావు, బల్లా పల్లవి, సరళ, టిడిపి నాయకులు గోళ్ల సుధాకర్‌నాయుడు, నెట్టెం బాలకృష్ణ, ఈడిగ నాగభూషణం, ముస్తాక్, జయరామ్‌నాయక్ మున్సిపల్ అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు

అనంతపురంలో కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. జనసేన నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నియోజకవర్గ, మండల కేంద్రాల్లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పలు ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. మహిళలకు చీరలు పంచిపెట్టారు.

నేడు ఐద్వా జిల్లా మహాసభలు

హాజరుకానున్న జాతీయ నాయకురాలు పుణ్యవతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 7వ జిల్లా మహాసభలను అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో నిర్వహించనున్నట్లు ఐద్వా రాష్ట్ర నాయకులు సావిత్రి, జిల్లా అధ్యక్షురాలు శ్యామల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్య వక్తగా ఆలిండియా నాయకులు ఎస్.పుణ్యవతి, డాక్టర్ హేమలత, డాక్టర్ ప్రసూన హాజరుకానున్నట్లు తెలిపారు. అంతేగాకుండా జిల్లా నలుమూలల నుంచి ప్రతినిధులు హాజరవుతారన్నారు. కావున జిల్లా ప్రతినిధులు అందరూ సకాలంలో హాజరుకావాలని కోరారు.

జెడ్పీలో కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

జిల్లా ప్రజా పరిషత్‌లో పని చేస్తూ అకాల మరణం పొందిన 9మంది ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు కల్పించారు. అర్హత కలిగిన తొమ్మిది మందికి ఆఫీసు సబార్డినేట్లుగా ఉద్యోగాలను కల్పిస్తూ జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మంగళవారం తన కార్యాలయంలోని ఛాంబర్‌లో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గిరిజమ్మ మాట్లాడుతూ పాలకవర్గం, అధికార యంత్రాంగం ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఈక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పెద్ద ఎత్తున కారుణ్య నియామకాలు, పదోన్నతులను కల్పిస్తున్నామనిన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జి.శివశంకర్, ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి జి.వెంకట సుబ్బయ్య, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు నాయకులు సూరి, ఉమాగౌడ్

ప్రజాశక్తి-పుట్లూరు

ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్రంలో పని చేస్తున్న ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు సూరి, ఉమాగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆశావర్కర్ల కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ ఆశావర్కర్లపై పని భారం పెరగడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. పనికితగ్గ వేతనం అందకపోగా, కనీస వేతనం రూ.26వేలు అమలు కావడం లేదన్నారు. ఆశావర్కర్లను రాత్రిళ్లు కూడా విధులు నిర్వహించాలని చెప్పడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇటీవల ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పి ఆశావర్కర్లపై మరింత పని భారం పెంచుతున్నారన్నారు. సెలవులు అడగాలంటే అయిదారు మంది అధికారుల అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ముఖ్యంగా పుట్లూరు మండలంలో మరింత నిరంకుశత్వం పెరిగిందన్నారు. వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో యుపిహెచ్‌సిని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆశావర్కర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శివమ్మ, కార్యదర్శిగా నాగేంద్రమ్మ, ఉపాధ్యక్షురాలిగా నాగలక్ష్మి, సహాయ కార్యదర్శిగా విజయలక్ష్మి, కోశాధికారిగా పెద్దక్క, 10 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు హనుమంతురెడ్డి, సూరి, భాస్కర్, రాఘవరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెద్దయ్య, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందాలి

డిఎంహెచ్ఓ డాక్టర్ ఇబి దేవి

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల, గ్రామస్థాయి వైద్య సిబ్బందిని వైద్యాధికారులు సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఇబి దేవి సూచించారు. మంగళవారం వజ్రకరూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో పాల్గొని సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు నివేదికలు సిద్ధం చేసుకుని ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉన్న ఆశా కార్యకర్తలు వారి పరిధిలో ఉన్న గర్భిణులు, చిన్నపిల్లల తల్లులు, చిన్నారులు ఆరోగ్య విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మాతా శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ఆశావర్కర్లు అప్రమత్తంగా ఉండాలని పిపి యూనిట్ ఆసుపత్రి వైద్యాధికారులు గంగాధర్, అరుణ, హరిత సూచించారు. మంగళవారం స్థానిక పిపి యూనిట్ ఆసుపత్రిలో ఆశావర్కర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడే అవకాశం ఉందన్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్వాడీ సెంటర్లలో లభించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకునేలా తెలియజేయాలన్నారు. ప్రజలు తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వేణుగోపాల్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ ఇబి దేవి

యాడికి : యాడికి, రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరమేశ్వర్, డాక్టర్ సాయి సుమంత్‌రెడ్డి, రాయలచెరువు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరాజన్, డాక్టర్అప్పయ్య ఆధ్వర్యంలో ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో యాడికి సిహెచ్ జుబేదా, సూపర్‌వైజర్లు రామ్‌ప్రసాద్‌గౌడ్, శోభాకుమారి, రాయలచెరువు ఎంపిహెచ్ఇఒ రామచంద్రనాయక్, సూపర్‌వైజర్ షబ్బీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

డివిజినల్ అభివృద్ధి అధికారిణి నాగ శివలీల

ప్రజాశక్తి-ఆత్మకూరు

గ్రామాల్లో ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అనంతపురం డివిజినల్ అభివృద్ధి అధికారిణి నాగ శివలీల సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆకస్మికంగా పర్యటించిన ఆమె పంచాయతీలో చేపట్టిన ఇంటింటి చెత్త సేకరణ, వీధుల శుభ్రం వంటి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాలువల్లు, రోడ్లలో చెత్త వేయకూడదన్నారు. పంచాయతీ సిబ్బందికి సహకరించి చెత్తను వాహనాలకు వేయాలన్నారు. పరిశుభ్రత ఎక్కడ ఉంటుందో అక్కడ ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. తర్వాత చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఇక్కడ వర్మీకంపోస్ట్ తయారు చేయడం, మొక్కలు పెంపకం వంటివి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత పి.యాలేరులో ప్రభుత్వం చేపట్టిన స్వామిత్వ సర్వేను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కామక్క, పంచాయతీ కార్యదర్శులు సాదిక్‌వలి, రామాంజనేయులు, మల్లేష్, సచివాలయ సిబ్బంది బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణపై వివరాలు సేకరిస్తున్న నాగశివలీల

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నగరంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో సిఐటియు, గ్రామపంచాయతీ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.వి నాయుడు, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న ప్రకారం, గ్రామ పంచాయతీ కార్మికులకు కూడా రూ.21వేలు చెల్లించాలన్నారు. పంచాయతీలతో సంబంధం లేకుండా ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలని, కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ,సౌకర్యం కల్పించి, పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 18వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలలో ఆయా సమస్యలపై చర్చించి న్యాయం చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ఈనెల 10వ తేదీన జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు బాషా, మధు, కుళ్లాయమ్మ, నాగేంద్ర, పెద్దన్న, చంద్ర, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

15న లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15వతేదీన లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి వేణుగోపాల్, సిఐటియు మండల కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన వాగ్దానం మేరకు బిల్డింగ్ వర్కర్లకు వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు అనేక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు రామకృష్ణ, కొండ కుళ్లాయమ్మ, ఇజ్జు, నాగేంద్ర, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

సజావుగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి యోగేశ్వరి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో పలు సమస్యలను ఎంపిపి వివరించారు. తర్వాత ఈనెల 1వతేదీన మండల పరిధిలోని గుమ్మేపల్లిలో నిర్వహించిన పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరైనా గ్రామ విఆర్ఒ, విఆర్ఎ ఎందుకు హాజరు కాలేదో చెప్పాలని గుమ్మేపల్లి సర్పంచు డేగల లలితమ్మ ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంపిడిఒ భాస్కర్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అధికారులు సమయం పాలన పాటించాలని సూచించారు. ఇకపోతే త్వరలోనే ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బిల్లులు ఖాతాలకు జమ అవుతాయన్నారు. వీటితోపాటు పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి విజయ, ఐసిడిఎస్ సిడిపిఒ చల్లా లలితమ్మ, అగ్రికల్చర్ ఎఒ అన్వేష్‌కుమార్, వెటర్నరీ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంఇఒ నరసింహారాజు, ఇన్‌ఛార్జి విద్యుత్ ఎఇ విజయ్‌కుమార్, పిహెచ్‌సి డాక్టర్ శంకర్‌నాయక్, సింగిల్‌విండ్ ప్రెసిడెంట్ గుర్రం లక్ష్మీనారాయణ, నాయీబ్రాహ్మణుల రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఆదినారాయణ, మైనార్టీ కో ఆప్షన్ సభ్యులు అలిఖాన్, ఎంపిటిసిలు రఘురెడ్డి, మొరార్జీ, సర్పంచులు డేగల లలితమ్మ, సరోజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధితో పేదల జీవితాల్లో వెలుగు

ఉరవకొండ : సిఎం సహాయ నిధి ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నట్లు టిడిపి సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని 18 మందికి మంజూరైన రూ.8,84 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి సాయం లక్షలాది నిరుపేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోందన్నారు.

వెల్లుట్లలో 'పొలం పిలుస్తోంది'

పుట్లూరు : మండల పరిధిలోని ఎల్లుట్ల గ్రామంలో అనంతపురం రైతు శిక్షణ కేంద్రం ఎడిఎ పద్మలత ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖలో అమలు అవుతున్న పథకాలపై ఎఒ కాత్యాయని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి చిన్న నాగిరెడ్డి, విహెచ్ఎ కుమార్ రాజా, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో 'ఇంటర్నల్ హేకథాన్'

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్సు విభాగంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ వారు అమరావతి క్వాంటమ్ వ్యాలీ హేకథాన్‌లో భాగంగా ఇంటర్నల్ హేకథాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 8 టీంలు పాల్గొన్నాయి. వాటి నుంచి టాప్ 5 టీంలను గుర్తించి అమరావతి క్వాంటం వ్యాలి హేకథాన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. అనంతపురం జెఎన్‌టియు కళాశాల నుంచి టాప్ 2 టీమ్‌లు సెమీఫైనల్ వెళ్తాయి. ఈ కార్యక్రమంలో సి.శోభాబిందు, ఎపి శివకుమార్, కె.మాధవి, హెచ్ఒడి కెఎఫ్ భారతి, ఆర్.రాజశేఖర్ (స్పాక్), బి.ఓంప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

చదరంగం క్రీడాకారునికి ఎమ్మెల్యే ప్రోత్సాహం

కళ్యాణదుర్గం టౌన్ : జిల్లా కేంద్రానికి చెందిన చదరంగం క్రీడాకారుడు చిచ్చరపిడుగు శామ్యూల్ స్టీఫెన్ నోబుల్‌ను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రోత్సహించారు. ఇందులో భాగంగా జిల్లాకేంద్రంలో మంగళవారం క్రీడాకారుడిని సన్మానించి అభినందించారు. 2019 నుంచి రాష్ట్రంలో జరిగిన వివిధ స్థాయిలో పోటీలలో రాష్ట్ర ఛాంపియన్‌గా నిలిచి, హైదరాబాద్‌లోని ఇంటర్‌నేషనల్ వీ-4 టోర్నమెంట్‌లో ఛాంపియన్, నేషనల్ స్కూల్ 2025 జనవరిలో జరిగిన పోటీల్లో మొదటి స్థానం సాధించారని ప్రసంశించారు. అబూదాబిలో 60 దేశల్లో పాల్గొన్న బీ క్యాటగిరి టోర్నమెంట్‌లో ఛాంపియన్‌గా నిలిచి భారతదేశం తరపున ఆషియన్ కంట్రీస్ టోర్నమెంట్‌లో పాల్గొనడం గర్వంగా ఉందన్నారు. ఇందుకు తదిపరి శిక్షణ తీసుకోవడానికి హైదరాబాద్‌లోని ఉత్తమ చెస్‌అకాడమి (రామరాజు చెస్ అకాడమి)కి రూ.50వేలు ఎమ్మెల్యే అందజేశారు.

4న జాబ్‌మేళా

అనంతపురం సిటీ : ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నిరుద్యోగ, యువతీ యువకుల కోసం నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న ఉపాధి కల్పనా కార్యాలయంలో ఈనెల 4న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనాధికారి ఎస్.పల్లవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని మగువ ఫ్యాషన్స్ వారు సేల్స్ సెక్యూరిటీ గార్డ్, క్యాషియర్, రిసీవర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, హౌస్ కీపర్ వంటి పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నట్లు తెలిపారు. 18 నుంచి 50ఏళ్లలోపు వయసు కలిగిన అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో పాటు ఆధార్, పాన్, బ్యాంక్ పాస్‌బుక్ తీసుకురావాలని కోరారు.

ఎంబిబిఎస్ ర్యాంకర్‌కు సన్మానం

ఉరవకొండ : ఎంబిబిఎస్‌లో ర్యాంకు సాధించిన పట్టణానికి చెందిన ఎంఆర్‌పిఎస్ నాయకులు మీనుగ రాజు కుమార్తె వెన్నెలను ఎరుకుల సేవాసంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ముందుగా ఉరవకొండలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎరుకల సేవాసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాకే పురుషోత్తం, జివిఎస్ నియోజవర్గ అధ్యక్షులు సాకే మహేంద్ర, కుల పెద్దలు వీరేంద్ర, గోవిందు, వీరేష్, చిన్న వీరన్న, చిన్న వీరేష్, సురేష్, శివరాజ్, విష్ణు, చిన్న, పురుషోత్తం, పెద్ద వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరికి ఆర్థికసాయం

పుట్లూరు : రెండు నెలల క్రితం కుక్కల దాడిలో 37 గొర్రెలు మృతిచెందిన కాపరి పుట్లూరు గ్రామానికి చెందిన తలారి శ్రీనివాసులుకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2.40లక్షలను ఎంపి తలారి రంగయ్య అనంతపురంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ రైతు తలారి శ్రీనివాసులుకు జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబును వ్యక్తిగతంగా కలిసి ఆర్థిక సాయం చేశాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఇందుకు సిఎం స్పందిస్తూ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

బెలుగుప్ప : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆగస్టు నెలలో 6 నుంచి 10వ తరగతి వరకు వందశాతం పాఠశాలకు హాజరైన 66 మంది విద్యార్థులు, ఫార్మేటివ్ అసెస్మెంట్ వన్.1 పరీక్షల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన 32 మంది విద్యార్థులకు మంగళవారం ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా గుత్తి డివైఇఒ, పూర్వ విద్యార్థి పాటిల్ మల్లారెడ్డి మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివిన తాను పాఠశాల రుణం తీర్చుకోవాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గతేడాది నుంచి ఇలా విద్యార్థులను ప్రోత్సహించేందుకు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లెల వెంకట ప్రసాద్, పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ రుద్రయ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు

వైభవంగా మారెమ్మ జాతర

బెలుగుప్ప : మండలంలోని బెలుగుప్ప తండాలో గిరిజనవాసులు మంగళవారం మారమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి పొట్టేళ్లు బలి ఇచ్చారు. ఆనవాయితీ ప్రకారం మారెమ్మ ఆలయం ముందు ముళ్లపొదలు వేసి పూజారి చంద్రానాయక్ పొదలపై నడుచుకుంటూ వెళ్లడం భక్తులను అబ్బురపరిచింది.

మెట్టు గోవిందరెడ్డిని కలిసిన తలారి రంగయ్య

రాయదుర్గం : రాయదుర్గం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డిని మంగళవారం రాయదుర్గంలోని నివాసంలో మాజీ ఎంపీ తలారి రంగయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థకు ఎఫ్‌సిఆర్ఎను రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ త్వరలో కళ్యాణదుర్గం నుంచి రాయదుర్గం, ఉరవకొండ మీదుగా అనంతపురం వరకూ చేపట్టబోయే భారీ బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని తలారి రంగయ్య కోరారు. ఇందుకు మెట్టు గోవిందరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ తమ సంపూర్ణ సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.

ఉద్యోగ విరమణ ఉపాధ్యాయునికి సన్మానం

బెలుగుప్ప : మండల పరిధిలోని వెంకటాద్రిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన రేపూరి జాన్సన్ దంపతులను ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీశిరీష అధ్యక్షతన మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి హరికృష్ణ, ఉపాధ్యాయులు వేణుగోపాల్, రాఘవ, బాలాజీ, సోమశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, గౌని పాతిరెడ్డి, గ్రామపెద్దలు సునీల్, ఎర్రిస్వామి, రవీంద్ర, ఉమాపతి, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఆరోగ్య సిబ్బందికి..

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న వైద్య సిబ్బందిని డాక్టర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. బదిలీ అయిన వారిలో బిహెచ్ఎన్ మేరీ, స్టాఫ్‌నర్సులు భువనేశ్వరి, జయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు రామ, గోవిందరాజులు, రామాంజనేయులు, ఎఎన్ఎంలు వరలక్ష్మి, నిర్మల, సుధ, పద్మ, సంగీత, నాగలక్ష్మి, నాగమణి ఉన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధురాలు మిస్సింగ్

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని నామనాంకుపల్లి గ్రామానికి చెందిన వి.జయలలిత వారం రోజుల నుంచి కనిపించకుండా పోయిందని కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జయలలిత మతిస్థిమితం లేకపోవడంతో ఇంట్లో నుంచి వారం రోజుల క్రితం వెళ్లిపోయిందన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా గుర్తుపడితే పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్‌లోగానీ, కుటుంబ సభ్యులకు గానీ, ఫోన్ 90134 47945 నెంబర్‌కుగానీ సమాచారం ఇవ్వాలని కోరారు.

ధర్నా చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు

మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ భర్త మాతృనాయక్

ప్రజాశక్తి-గుంతకల్లు

స్థానిక మార్కెట్ యార్డులోని రైతు బజార్ వద్ద ఉన్న నేమ్ బోర్డులో వైఎస్ఆర్ పేరు తీసివేశారని తన కార్యాలయం ముందు ధర్నా చేసిన వైసిపి నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు యార్డు ఛైర్‌పర్సన్ సుగాలి లక్ష్మీదేవి భర్త మాతృనాయక్ తెలిపారు. మంగళవారం యార్డులోని కార్యాలయంలో వైస్‌ఛైర్మన్, సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో మార్కెట్ యార్డులోని రైతు బజార్‌కు వైఎస్ఆర్ రైతు బజార్ పేరుతో శిలాఫలకం వేశారన్నారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చాక ఇటీవల మార్కెట్ యార్డు కొత్త కమిటీ ఏర్పాటైన విషయం తెలిసిందే అన్నారు. గత టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ పేరతో ధోనిముక్కల రోడ్డు సమీపంలో కాలనీ ఏర్పాటు చేశారన్నారు. అదేవిధంగా కసాపురం రోడ్డులోని పార్కుకు అయ్యప్ప వనంగా పేరు ఉండేదన్నారు. అయితే వైసిపి అధికారంలోకి రాగానే ఆయా పేర్లను తొలగించి వైఎస్ఆర్ పేర్లు పెట్టారన్నారు. అయితే తాము అధికారంలోకి వచ్చాక వైఎస్ఆర్ పేరు తీసివేసి రైతుబజార్ అని పెట్టామన్నారు. మీమాదిరి తాము పేరు మార్చలేదన్నారు. మీ హయాంలో మెదపని నోరు.. ఇప్పుడు ఎలా మెదుపుతున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారినా పేర్లు మార్చకూడదనే ఉద్దేశంతోనే రైతు బజార్ అని పెట్టామన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు ఇలాంటి చౌకబారు రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. ఈ సమావేశంలో మార్కెట్టు యార్డు వైస్‌ఛైర్మన్ కురుబ రాణాప్రతాప్ (రామప్ప), డైరెక్టర్లు శ్రీదేవి, వీరాంజనేయులు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నేతలు

ఈ పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి-రాప్తాడు

మండల పరిధిలోని ప్రసన్నాయపల్లి, రాప్తాడు 1, 2 ఆర్ఎస్‌కెల పరిధిలో చేపట్టిన ఈ పంట నమోదును అనంతపురం సహాయ వ్యవసాయ సంచాలకులు అల్తాఫ్ ఆలీఖాన్ పరిశీలించారు. ఇందులో భాగంగా అయ్యవారిపల్లిలో భాస్కర్, గంగులకుంటలో మల్లికార్జున, రాప్తాడులో తిమ్మప్ప సాగు చేసిన కందిలో చేపట్టిన పంటను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన ప్రతి పంటనూ ఆర్ఎస్‌కె ఇన్‌ఛార్జి ద్వారా నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు ప్రక్రియకు సెప్టెంబర్ 30వతేదీ లో వందశాతం పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా తహశీల్దార్‌ను కలిసి రెవెన్యూ పరంగా జాయింట్ ఎల్‌పిఎం, సమస్యాత్మక భూముల విషయంలో పంట నమోదుకు విఆర్‌ఓల అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎస్.కృష్ణచైతన్య, ఆర్ఎస్‌కె ఇన్‌ఛార్జిలు గిరిధర్, భారతి, సోనియా, రైతులు పాల్గొన్నారు.

పంట నమోదు వివరాలు తెలుసుకుంటున్న ఎడిఎ

పనివేళల్లో మద్యం తాగి పడుకున్న ఆసుపత్రి ఉద్యోగి

రాయదుర్గం : పట్టణంలోని ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో రేడియోగ్రాఫర్‌గా విధులు నిర్వహిస్తున్న మదన్ మంగళవారం మధ్యాహ్నం విధి నిర్వహణలో తప్ప తాగి ఆసుపత్రి గదిలో మంచంపై పడుకున్నాడు. ఆసుపత్రికి వచ్చిన రోగులు అతన్ని లేపడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. శరీరంపై దుస్తులు లేకుండా అర్ధనగ్నంగా పడిపోవడంతో ప్రజలు, రోగులు అసహనం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో, పనివేళల్లో వైద్య శాఖ ఉద్యోగి ఇలా ఆసుపత్రిని లాడ్జి గదిగా భావించి పడుకోవడం ఏంటని ప్రశ్నించారు. వెంటనే ఉన్నతాధికారులు ఘటనపై జోక్యం చేసుకుని విధి నిర్వహణలో మద్యం తాగి రోగులకు ఇబ్బందులకు గురిచేసిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.



తాగి పడుకున్న ఉద్యోగి

IN THE COURT OF THE I St ADDL. JUNIOR CIVIL JUDGE ANANTHAPURAMU
O.S NO:85/2023

Between:
N.Ramanjineyulu ...Plaintiff
AND
P.Ramesh ...Defendant

NOTICE TO THE DEFENDANT

To,
P.Ramesh S/o P. Satyamaiah Business, India, Hindu, residing at D.No.2/4/158, Chandrababu Colony, Ananthapuramu
పై నెంబరు కేసులో Defendant అయిన మీ హాజరు నిమిత్తము 09-09-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(By Order of the Court)
Sri R. Rama Kumar,
Sri K. Nagaraju,
Advocates, Ananthapuramu.

IN THE COURT OF CIVIL JUDGE [SENIOR DIVISION] : GOOTY
O.S.No: 25/2021

Between:
D. Ramakrishna ...Plaintiff
AND
M. Lakshmidevi and Others ...Defendant

NOTICE TO THE DEFENDANT NO:7

D7: M.Sujatha D/o Late M.Sunkanna, Resident of Jakkala Cheruvu Village, Gooty Mandal, Ananthapur District.
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 15-09-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు..

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
T.Dhanunjaya,
Advocate, Gooty
Cell No: 98858 96307

IN THE COURT OF THE PRL.DISTRICT JUDGE, ANANTHAPURAMU
E.P.No:127/2024 in ARB Case No: ARC/FSBFL/1120

Between:
M/S. Five Star Business Finance Limited, Ananthapur Represented by its Authorized Signatory, Y.Shyam Prasad, Ananthapur. ...Petitioner/ D.HR
V/S
J.Dr1:Bugude Manoj Kumar S/O Bugude Nagaraju,, business, D.No.1-132, D.Hirehal Village and Mandal, Anantapur Distict.
J.Dr2: Bugude Lalitha W/O Bugude Nagaraju, D.No.1-132, D.Hirehal, Anantapur District. ...Respondants /J.DRS

వేలం ప్రకటన

అర్జీదారుడు ఇ.పి. మొత్తమును రాబట్టుటకు J.Drsకు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చి యున్నారు. వేలములో పాల్గొనదలచినవారు 19-09-2025వ తేది ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.

SCHEDULE

The property is situated in R.D Anantapur and SRD of Rayadurgam, within the fields of D.Hirehal Village and Gram Panchayat, D.Hirehal Mandal, Anantapur DistrictSy.No. 406/2A, Extent; 94.44 sq yards,D.No; 3/12,Asst.No; 364,Boundaries:East by: Land of Thippeswamy, West by: Bugade Narayanappa's House, North by:Road and South by: Land of Thippeswamy.Measurements:East-West-34 feet or 10.21 meters and North-South-25 feet or 7.51 meters. totally measuring 94.44 sq yards.
DHr Value Rs.2,50,000/-
Ameen value,Rs:4,87,500/-

(By Order of the Court)
M.SURESH KUMAR,
Advocate, Ananthapuramu.
Cell:9441168233

IN THE COURT OF THE PRL.DISTRICT JUDGE, ANANTHAPURAMU
E.P. No.70 /2025 in Arbitration Case No. 4/2024

Between:
M/S. Five Star Business Finance Limited, Chennai Represented by its Authorized Signatory, G.Giddaiah, Kurnool ...Petitioner/ D.HR
V/S
J.Dr1. Shaik Mahaboob John W/O Shaik Sharmas Vali, Muslim,, D.No.6/4/152, Maruthi Nagar, 2nd Cross, Anantapur Town & District-
J.Dr2. Gajula Bshirun D/O Gajula Nabi Rasool, Muslim,, D.No.2/56, Chinna Kaluva Street, Singanamala Village & Mandal, Anantapur District-
J.Dr3. Gajula Beebi W/O Gajula Nabi Rasool, Muslim,, D.No.2/56, Chinna Kaluva Street, Singanamala Village & Mandal, Anantapur District-
J.Dr4. Shaik Sharmas Vali S/O Shaik Rasool, Muslim, age 42 years, business, D.No.6/4/152, Maruthi Nagar, 2nd Cross, Anantapur Town & District-515001 ...Respondants /J.DRS

వేలం ప్రకటన

అర్జీదారుడు ఇ.పి. మొత్తమును రాబట్టుటకు J.Drsకు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చి యున్నారు. వేలములో పాల్గొనదలచినవారు 08-09-2025వ తేది ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.

SCHEDULE

The property is situated in RD Anantapur and SRD of Tadipatri, within the limits of Tadipatri Municipality area, Haspital Street, Anantapuramu District,
Ward No.14, Sy.No:565-B-B. 565-B-F, Extent,60 Square Yards,House No.14-196/1, Asst: 1007009923, Boundaries: North by: House of S.Hasanbee, South by: Public Rasta, East by: House site of D. Hasan others and West by: Rasta Measurements:East-West - 5 Yards or 15 Feet or 4.57 meters and North-South-12 Yards or 36 feet or 10.98 meters.Totally site measuring-60 Square Yards and Built area is 540 Square Feet,
DHr Value Rs.4,50,000/-
Ameen value, Rs:15,00,000/-

(By Order of the Court)
M.SURESH KUMAR,
Advocate, Ananthapuramu.
Cell:9441168233

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిలు జడ్జి వారి కోర్టులో
E.P.No: 98/2016, in O.S.NO:224/2012

Between:
D.నరేష్ కుమార్. ...డిక్రీహోల్డర్
V/S
పి. మహమ్మద్ రఫీ ...జడ్జిమెంట్ డెబిటర్

వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజలకు తెలియ జేయడం ఏమనగా, ఈ దిగువ తెలిపిన షెడ్యూలు ఆస్తిని, పై తెలిపిన వాజ్యం నందు గౌరవ కోర్టు నందు తేది 17-09-2025 వ తేదిన ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 05:00 గంటల లోపల వేలము జరుప బడును.కావున ఆసక్తిగల సవాలుదారులు వేలమునందు పాల్గొనవచ్చును. కోర్టువారి షరతులకు లోబడి వేలము జరుప బడును.

షెడ్యూలు

అనంతపురము రిజిష్టరు డిస్ట్రిక్, గుంతకల్లు సబ్ రిజిష్టరు డిస్ట్రిక్ట్ కు చేరిన గుంతకల్లు గ్రామం పొలంలో గల భూమి వివరం.
బాబు: సర్కారు పుంజి, సర్వే:నెంబర్:369 సి, ఎ. సి:4-22 పైకి గుంతకల్లు మున్సిపల్ బెంజ్ కొట్టాలకు తూర్పు దిశన గల రెసిడెన్షియల్ ఏరియా లో కొత్త వార్డు:5, ప్రస్తుతం వార్డు 6 డోర్ నం: నెంబరు. 610 కి ఉత్తర దిశలో గల ప్లాట్ నెంబరు:78 గల బైలు స్థలమునకు హద్దులు :తూర్పు - ప్లాట్ నెంబరు79 గల స్థలము.
పడమర:ప్లాటనెంబరు 77 గల స్థలముఉత్తరం :ప్లాట్ నెంబరు. 70 గల స్థలము దక్షిణం :20 అడుగులు రోడ్డు
ఈ మధ్యగల – బైలు స్థలమునకు కొలతలు –
తూర్పు – పడమర : 20 అడుగులు లేక 6.09 మీటర్లు
ఉత్తరం – దక్షిణం : 60 అడుగులు లేక 18.28 మీటర్లు
వెరసి 133:33 చదరపు గజాలు
డిక్రీ హెూల్డర్ విలువ రూ:6,00,000/-
అమీనా విలువ. రూ. 7,50,000/-
మా ర్కెట్ విలువ: రూ. 2,93,326/

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
ఎం. శ్రీనివాసులు, బి. లక్ష్మీ నారాయణ
డిక్రీహోల్డర్ న్యాయవాదులు గుత్తి- అనంతపురము జిల్లా
సెల్: 98481 65583.

ANANTAPURAMU MUNICIPAL CORPORATION

e-PROCUREMENT-Tender Notice

1	Tender Notice No.	223 to 230//General Funds/2025-26/TO
2	Scope of Work	Filling of Pot Holes with BT and CC Patches in various places in the town
3	No. of works	8 Nos
4	Estimate Cost Ranging	Rs. 4.20 to 9.90 Lakhs

Note:. The details of tender may be seen on e-procurement market Place available @ https://tenderapeprocuremerlt.gov.in

Sd/- Commissioner
Municipal Corporation,
Ananthapuramu